స్వాతి - మే, 1987

"కారణం తనే అయినా సరే - వంట ఆలస్యమైతే చాలు - నా భర్త ఆకాశంలో ధరలంత ఎత్తుకు ఎగిరి అక్కణ్ణించి సూర్యుడిలా మండిపడతాడు"- అన్న ఫిర్యాదు ఈ దేశంలోని చాలామంది ఇల్లాళ్ళవద్దనే ఉంది.

# దొంగల భయం

"కమలా!" అంటూ పెద్దగా ఉత్సాహంగా కేకపెట్టారు శ్రీవారు. ఆకేక డ్రాయింగు రూములోంచి వంటింట్లోకి చేరాక కూడా నా కర్ణపుటాలను అదరగొట్టింది.

శ్రీవారు అప్పుడప్పుడు అలా అరుస్తూంటారు. సాధారణంగా ఏదైనా గొప్ప విషయం కనిపెట్టినప్పుడు ఆయనలా కేకలు పెడుతుంటారు. అలా అరిచి పిలిచినప్పుడు నేను వెంటనే వెళ్ళాలి. లేకపోతే ఆయనకు కోపం వస్తుంది.

ఈ భర్తలున్నారు చూశారూ (నాకొక్కడే భర్తలెండి!) వీళ్ళు మనచేత ఓట్లేయించుకుని మనపై అధికారం చెలాయించే నాయకుల్లాగే - ఆడపిల్లల దగ్గర కట్నం పుచ్చుకుని ఆ తర్వాత వాళ్ళ మీదే పెత్తనం చెలాయిస్తారు. అయిదేళ్ళకోసారి నాయకులు ప్రజలకు దణ్ణాలు పెడితే ఈ భర్తలు వారానికో మూడునాలుగు రోజులు పెళ్ళాలకు ఏదోరాత్రివేళ ఓ గంటసేపు దణ్ణాలు పెడుతూంటారు. ఏది ఏమైనా చివరికి నాయకులు ప్రజలను శాసిస్తారు. భర్త భార్యను శాసిస్తాడు. ఎదురు తిరిగితే ఇటు ప్రజలకూ, అటు భార్యలకూ కూడా సుఖజీవనముండదు. ఇది గ్రహించిన నేను ఆయన మనసు తెలిసి మసులుకుంటూంటాను. అందుకే ఇప్పుడు కూడా - "ఆఁవస్తున్నా"- అంటూ చేస్తూన్న పని వదిలి పరుగుపరుగున వెళ్ళాను.

"దొంగతనాన్ని ఎలా నివారించాలో నాకు తెలిసిపోయిందోయ్" అంటూ శ్రీవారు చేతిలోని పుస్తకాన్ని చూపించారు.

"ఏమిటండీ?" అన్నాను విషయం అర్థంకాక తెల్లమొహం వేస్తూ.

"దొంగతనాల సమస్య - మనకే కాదు, ఇంకా చాలామందికి ఉన్నట్లుంది. అచ్చం మన సమస్యల్లాంటివే - ఈ పత్రికలో ఒక రచయిత్రి చర్చించింది."

విషయం నాకు అర్థమైనా పాఠకులకు అర్థం కావడం కష్టమనుకుంటాను. మాదొక పెద్ద హౌసింగ్‌బోర్డ్ కాలనీ. ఇందులోకి మేము వచ్చి ఆర్నెల్లయింది. ఇక్కడ

అంతా బాగానే ఉంది. కానీ దొంగతనాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. వారానికి ఒకటి రెండు రోజులైనా ఏదో యింట దొంగతనం జరిగినట్లు వింటూంటాం. దొంగతనం ఎలా జరుగుతుందో, దొంగ ఎక్కణ్ణించి వస్తున్నాడో తెలియదు కానీ - ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఏదో ఒకచోట దొంగతనం జరుగుతూనే ఉంది.

ఆ కాలనీలో - ముఖ్యంగా మా వీధిలో మంచి కట్టుబాటు ఉంది. మగవాళ్ళు అంతా తలో ఆఫీసులోనూ పనిచేస్తున్నారు. అయినా అంతా ఏక కుటుంబంలా ఉంటాము. అంతా కలిసి వారానికో యింట సమావేశం కావడమూ, నెలకొకసారి మాలో మేము వినోదప్రదర్శనలేర్పాటు చేసుకొనడమూ అందరం తలో పుస్తకం కొని మాలో మేము మార్పిడి చేసుకొనడమూ మా ఐకమత్యాన్ని తెలియజేస్తుంది.

ఇంత ఐకమత్యం ఉన్న మా వీధిలో కూడా ఈ ఆర్నెల్లలోనూ నాలుగు దొంగతనాలు జరిగాయి. దీంతో వీధి వీధంతా అట్టుడికిపోయింది. కలుసుకున్నప్పుడల్లా దొంగతనం గూర్చిన చర్చలే! అందరూ రకరకాల ఉపాయాలలోచించేవాళ్ళు. సమావేశాల్లో వాటిని చర్చించేవాళ్ళు.

"దేశంలో నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోయింది. నిరుద్యోగుల్లో అధికశాతం విద్యాధికులు. దొంగతనాలు పెరుగుతాయి. అవి తెలివిగా జరుగుతాయి-"

ఎన్నో చర్చల సారాంశమిది. ఇందులో దొంగతనాలకు కారణమే కానీ నివారణోపాయం లేదు. సూచనప్రాయంగా కనపడే నివారణోపాయం - అనగా నిరుద్యోగులకుపాధి కల్పించడమన్నది మన చేతుల్లో లేదు.

శ్రీవారు దొంగతనాల గురించి చాలా తీవ్రంగా ఆలోచిస్తున్నారు. నాకున్న నాలుగైదు తులాల బంగారంకోసం ఆయన లాకరు తీసుకున్నారు. దానికోసం ఏడాదికి కొంత డబ్బు కట్టాలి. వీధి తలుపుకు లోపలివైపు బలమైన ఇనుప గడియ వేయించారు. దానికో యాభైరూపాయలు ఖర్చయింది. అది మేము ఇంట్లో ఉండగా దొంగరాకుండా ఆపడానికి. మేము బయటకు వెళ్ళినపుడు దొంగ రాకుండా ఉండడంకోసం ఖరీదయిన తాళం ఒకటికొన్నాం. వీధికెప్పుడూ రెండు తాళాలు వేస్తున్నాం.

ఆ తర్వాత మళ్ళీ ఈరోజు ఏదో పుస్తకం చూపిస్తున్నారు.

"అలా చూస్తావేమిటోయ్. ఈ పత్రికలో ఓ రచయిత్రి దొంగతనాలు జరగడానికో కొత్త కారణం రాసింది. అది కొట్టేయవలసిన పాయింటు కాదు" అంటూ శ్రీవారు పుస్తకం నాచేతికందించారు.

అవతల నాకు పనుంది. అందువల్ల ఈ విషయమై నాకాసక్తి లేదు. కానీ శ్రీవారి నిరంకుశత్వం తెలిసినదాన్ని కాబట్టి త్వరత్వరగా అది చదివాను. చదువుతూంటే రచయిత్రి రాసింది నిజమేననిపించింది.

మావీధిలోని అలవాటేమిటంటే - ఆడవాళ్ళంతా కలసి ఇళ్ళకు తాళాలు పెట్టుకుని పాలోమంటూ ఇంకో వీధిలోని ఎవరింటికో వెళ్ళడం! ఎవరేం చీరకొనుక్కున్నా, వస్తువుకొనుక్కున్నా చుట్టుప్రక్కల వాళ్ళందర్నీ పిలిచి చూపించడం! ఇలాంటి అలవాట్లవల్ల

వీధులు నిర్మానుష్యమవడమూ, ఇంట్లో ఉన్న వస్తువుల గురించి బాగా ప్రచారం లభించడమూ జరిగి దొంగలకు అనువుగా ఉంటుందని ఆవిడ రాసింది.

"నిజమేనండోయ్ - ఆవిడ రాసింది!" అన్నాను.

శ్రీవారేదైనా అంటే నేను ఒప్పేసుకొనడం ఆయనకు నచ్చదు. ఆయన ప్రజాస్వామ్య వాది. తనేం చెప్పినా ముందు నేను కాదనాలి. అప్పుడాయన నాకు విపులంగా అంతా వివరించి నాచేత అవుననిపిస్తారు. అవుననిపించడంతో ఆ కార్యక్రమం ముగియాలి. అయినప్పటికీ కాదనడంతోనే అది ఆరంభమవుతుంది. అందువల్ల సాధారణంగా నేను కాదనే అంటాను. కానీ ఈరోజు ఈ రచయిత్రి రాసింది నాకు అద్భుతంగా అనిపించింది. అదీకాక శ్రీవారి ఆఫీసుకు టైమైపోతోంది. ఇప్పుడు నేను కాదంటే అనవసరంగా సమయం వృథా అందుకే నేను వెంటనే ఒప్పేసుకున్నాను.

అయితే శ్రీవారు వెంటనే "ఏం నిజం? నీ మొహం... ఆవిడ రాసిందాంట్లో కొన్ని పాయింట్సు సరిగ్గాలేవు–" అన్నారు.

"మీరూ నేనూ చర్చించుకుని లాభమేమిటి? ఈ వేళలాగూ మన వారంవారం సమావేశం ఉండనే ఉంది. అక్కడ చెప్పండి" అని సమాధానం కోసం ఎదురుచూడకుండా వంటింట్లోకి వెళ్ళిపోయాను. ఎందుకంటే వారు తనకారణంగానే అయినప్పటికీ - వంట ఆలస్యమైతే - ఆకాశంలో ధరలకంటె కాస్త ఎత్తుకువెళ్ళి - సూర్యుడిలా మండిపడతారు.

ఈ విషయాన్ని మావారెంత సీరియస్‌గా తీసుకున్నారో ఆనాటి సాయంత్రం మేము శరభయ్యగారింట్లో సమావేశమైనప్పుడు గ్రహించాను. ఆయన పత్రికలో వ్యాసం ప్రసక్తి తీసుకొచ్చేరు.

వెంటనే రామారావుగారు - "అదా? నేనూ చదివాను. చదువుతూంటే నిజమేనేమో ననిపించింది" అన్నాడు.

"ఇదివరలో మేముండే వీధిలో చుట్టు ప్రక్కలవాళ్ళమంతా అంటీముట్ట నట్లుండేవాళ్ళం. అక్కడ ఒక్క దొంగతనం కూడా ఎరుగం" అన్నాన్నేను.

శరభయ్య శ్రీమతిగారు దీనికి కాస్త ఆవేశపడింది. "ఆ రచయిత్రి రాసింది నిజమే కావచ్చు. కానీ మన వీధిలో ఇంతవరకూ జరిగిన దొంగతనాలన్నీ కూడా పట్టపగలు - అదీ ఎవరింట్లో వారు పనుల్లో ఉండగా జరుగుతున్నవే! రాత్రిపూట అదీ ఇలా సమావేశాలప్పుడూ, సినిమాలకెళ్ళినప్పుడూ, ఊళ్ళకెళ్ళినప్పుడూ ఒక్కటీ జరగలేదు. అలాంటప్పుడు సమావేశాలూ, సినిమాలూ, ఇళ్ళకెళ్ళడాలూ, ఊళ్ళకెళ్ళడాలూ - అన్నీ ఎందుకు మానాలి? అయినా అలా ఎన్నాళ్ళని మానగలం?"

"ఆవిడ రాసిందికదా అని అసూయపడకు - ఇలాంటి రచనే చేస్తానంటే నిన్ను మాత్రం వద్దన్నదెవరు?" అని జోకాడు శరభయ్య.

దీనికి బదులుగా రాజు - "ఒకటి మాత్రం ఒప్పుకోవాలండీ - ఈ ఆడవాళ్ళకి తాముకొన్న ప్రతి వస్తువూ అందరికీ చూపించడం అలవాటు. ఉదాహరణకు మా

శ్రీమతిని తీసుకోండి. మొన్న ఓ స్టీలు గిన్నె కొందా - అది ఈ వీధిలో అందరికీ చూపించింది. ఈ అలవాటు మానుకోవాలి!" అన్నాడు.

రాజు పూర్తిచేయగానే వాళ్ళెదురింటావిడ గయ్‌మని లేచింది. "మీ శ్రీమతికొన్న స్టీలుగిన్నె చూపించిందెవరికి - మాకే కదా? మేమేమన్నా దొంగతనాలు చేస్తామా, లేక దొంగలకు చెబుతామా? అదీకాక ఆవిడ ఇంటింటికీ తిరిగి చూపించలేదే. మీ ఇంటికొచ్చినవాళ్ళకి చూపించింది. మనమొక బంగారు వస్తువు చేయించుకున్నామనుకోండి. అది నలుగురికీ తెలియాలనే కదా ఫంక్షన్స్‌కి పెట్టుకుంటాం. అంతేకానీ ఇంట్లో నాలుగు తలుపులూ వేసుకుని ఓ గంటసేపు మెళ్ళో వేసుకుని తర్వాత లాకర్లో దాచేసుకునే మాటైతే అది చేయించుకోవడం దండగని నా అభిప్రాయం-" అని యింకా ఏదో అనబోతూండగా ఆమెభర్త ఆమెను దెబ్బలాడేడు. "అలా ఆవేశపడతావెందుకూ? ఇది కేవలం చర్చ మాత్రమే... ఒకరినొకరు నొప్పించుకునేదేమీ లేదు-" అని.

"ఇది ఆవేశపడటంకాదు. మగాళ్ళు మరీ అన్నింటికీ పెడర్థాలు తీస్తారు. ఎవరి అభిప్రాయాలు వాళ్ళు చెప్పకపోతే ఇది చర్చ ఎలాగవుతుంది?" అంటూ మరొకావిడ రాజువాళ్ళ ఎదురింటావిడని వెనకేసుకొచ్చింది.

మొత్తం మీద ఓ రెండు గంటలు చర్చ జరిగాక ఆ రచయిత్రి వ్యాసంలోని సూచనలు పాటించి కనీసం రెండు మూడు నెలలైనా చూడాలని తీర్మానమైంది. ఎవరు ఏ వస్తువు కొనుక్కున్నా ఎవరికీ చూపించకూడదు. దాని గురించి చెప్పకూడదు. ఆడవాళ్ళు పెత్తనాలు పూర్తిగా మానేయాలి. ఎవరైనా బయటకు వెళ్ళవలసివస్తే పక్కవాళ్ళతో ఎందుకు వెడుతున్నారో చెప్పకుండా యిల్లుచూడమని మాత్రం చెప్పాలి. అంతా కలిసి కట్టగట్టుకుని వీధి కాళీచేసి పోవడం పూర్తిగా మానేయాలి.

మావీధిలో ఎంతో కట్టు అని ఎప్పుడో చెప్పాను. ఈ తీర్మానాన్ని మేమంతా ఎంత కచ్చితంగా పాటించామంటే మా మటుక్కు మాకు ఏ రష్యాలోనో, చైనాలోనో ఉంటున్నామన్న అనుభూతి కలిగింది.

ఇలా అయిదారు వారాలు గడిచాయి. ఈ మధ్య వారం రోజులనుండి మా పక్కింటి మూర్తిగారింట్లో తెలుగుపాటలు చాలా తరచుగా వినిపిస్తున్నాయి. అవీ అస్తమానూ ఒకే పాటలు వినిపిస్తున్నాయి. ఆ పాటలన్నీ నాకిష్టమైనవి కావడంతో - నేను వెంటనే రేడియో దగ్గరకు పరుగెత్తి గబగబా మొత్తం మీడియం వేవంతా తిప్పేసేదాన్ని. కానీ ఎక్కడా నాకాపాటలు తగిలేవి కావు. నా అవస్థ చూసి శ్రీవారు - "వాళ్ళు టేపురికార్డరు కొనుక్కున్నారేమో-" అని ఊరుకున్నారు.

అయుండొచ్చుననిపించింది. ఈ మధ్యకాలంలో ఒకరివిషయాలొకరికి బొత్తిగా తెలియడం లేదు. ఎవరైనా ఏమైనా మాట్లాడుకున్నా మా వీధికి సంబంధించని సినిమా కబుర్లు, పుస్తకాలో కథల కబుర్లో తప్ప యింకేమీ మాట్లాడుకోవడం లేదు.

ఓ పదిరోజుల తర్వాత మూర్తిగారు, సతీమణి బిక్క ముఖాలేసుకుని మా ఇంటికి వచ్చారు. అప్పుడే శ్రీవారు ఆఫీసునుండి వచ్చారు. టిఫిను ప్లేట్లలో సర్దుతున్నాన్నేను.

వాళ్ళని చూడగానే టిఫిను మరో రెండు ప్లేట్లలోకి సర్దాను.

"మాకు టిఫిన్ వద్దండీ - ఈ సమయంలో ఏమీ ఎక్కదు-" అంది శ్రీమతి మూర్తి. నేను బలవంతపెట్టాను.

"మీరు చాలా డల్‌గా కనబడుతున్నారు. అసలు విషయమేమిటి?" అంటూ శ్రీవారు మూర్తిగారిని అడిగారు.

దానికి మూర్తిగారి జవాబు: మేము పదిహేనొందలు పెట్టి టేపు రికార్డరు కొన్నాం. మోడల్ చాలాబాగుంది. అందరికీ చూపించాలనున్నా మన నిర్ణయానికి కట్టుబడి ఊరుకున్నాం. ఈ రోజు మధ్యాహ్నం నా శ్రీమతి బెడ్‌రూంలో పడుకుని పుస్తకం చదువుతోందిట. తలుపులన్నీ జాగ్రత్తగా చూసుకుని వేసుకుని మరీ వచ్చిందిట. తనసలు మధ్యాహ్నం నిద్రపోదు. ఇంకొక గంట తర్వాత వెళ్ళిచూస్తే వీధి తలుపు తీసి ఉందట. టేపు రికార్డరు, కొంత స్టీలు సామానూ కనిపించడంలేదుట. నేనొచ్చేదాకా దిగులుగా కూర్చుని ఉంది శ్రీమతి. రేడియో టేపురికార్డరులాంటి వస్తువుల విషయంలో మనమో పాయింటు మర్చిపోయాం. అవి నలుగురికీ చూపించకపోయినా యింట్లో వాడుకుంటే చాలు బయటవాళ్ళకు వినిపిస్తాయి. వాటిని వాడడమే మేము చేసిన పొరపాటనిపిస్తోంది."

నిజమేననిపించింది నాకు. చెప్పకపోయినా మూర్తిగారు టేపు రికార్డరు కొన్నట్లు మేమూహించగలిగాం.

అయితే టేపు రికార్డరు కొనుక్కోవటమెందుకు? అది పెట్టుకుని వినకపోతే సరదా తీరదు. పెట్టుకుని వింటే దొంగలెత్తుకునిపోతారు.

అప్పుడు నాకు మూడేళ్ళ మా బాబు చెప్పిన కథ గుర్తుకొచ్చింది. వాడికిప్పుడిప్పుడే మాటలు వస్తున్నాయి. వాణ్ణి ఓ రోజున శ్రీవారు వళ్ళో కూర్చోపెట్టుకుని "ఏదైనా కథ చెప్పరా బాబీ" అన్నారు. వెంటనే వాడు ప్రారంభించాడు. మా వీధిలో దొంగతనాలు గురించి విన్నమూలాన వాడి కథా దొంగాడి గురించే! ఎదురుగా ఏ వస్తువు కనిపిస్తే అది కథలోకి వచ్చేలాగా కల్పించి చెప్పేస్తున్నాడు.

ఆ కల్పనలో ఎవరో ఒక బీరువా కొనుక్కున్నట్లూ - అది దొంగలపాలు కాకుండా మంచంకింద దాచుకున్నట్లూ చెప్పాడు. ఆ రోజు చాలా ఆనందించాం. కానీ అది గుర్తుకొస్తే ఈరోజు అదే తప్పనిసరేమోననిపిస్తోంది. కొనుక్కున్న ప్రతివస్తువూ మంచం క్రింద దాచేసుకుని ఆ మంచంమీదే మనముంటే ఇంక దొంగాడికి దొంగతనం చేసే అవకాశముండదు.

మూర్తిగారి సతీమణి ఇది విని - "ఏమోనమ్మా - సుఖమో, దుఃఖమో నల్గురితోనూ పంచుకుంటేనే బాగుంటుంది. మీతో ఈ దొంగతనం గురించి చెప్పుకున్నాక నా మనసు తేలికపడింది. కానీ టేపు రికార్డరులో పాటలు ఒక్కరోజు కూడా సంతోషాన్నివ్వలేదు. అందుక్కారణం దాని గురించి మీకెవ్వరికీ చెప్పలేదన్న బాధే!" అని వెళ్ళిపోయింది.

వాళ్ళు వెళ్ళిపోయాక శ్రీవారు - "ఆ వ్యాసం రాసిన రచయిత్రి అసలు భావం

నాకిప్పుడర్థమయింది" అన్నారు.

"ఏమిటండీ?" అన్నాను కుతూహలంగా.

"సుఖమో, దుఃఖమో నల్గురితోనూ పంచుకుంటేనే బాగుంటుందని మూర్తిగారి భార్య అంది. అయితే మనమలా చేస్తున్నామా? దేశంలో పూటకు గతిలేక, తిండిలేక, బట్టలేక అలమటించే వారందరితోనూ సుఖ దుఃఖాలు పంచుకోవాలని మన మనుకుంటున్నామా - అలా అనుకుంటే ఈ దొంగల భయముండేదా?" అన్నారు శ్రీవారు.

"ఏమోనండీ - మనకున్నంతలో అన్నీ కొనుక్కుని మనతోటివారి ముందు ప్రదర్శించుకుంటేనే ఆనందం నాకు-" అన్నాను.

"అలాగైతే మన బాబిగాడు కథలో చెప్పిన సలహా నువ్వుకూడా వ్యాసరూపంగా వ్రాయి-" అన్నారు శ్రీవారు.

శ్రీవారు చెప్పినట్లు దేశంలోని అందరితోటీ సుఖ దుఃఖాలు పంచుకోవాలా, వ్యాసం వ్రాయాలా అని చాలాసేపు ఆలోచించి వ్యాసం వ్రాయాలనే నిర్ణయానికి వచ్చాను.

✦ ✦ ✦